క్లుప్తంగా

డీజిల్‌కు మినహాయింపు ఇవ్వాలి

కోవూరు : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌ను బాటిల్స్, క్యాన్లలో అమ్మకాలు చేయొద్దని ఉత్తర్వులు జారీ చేసిందని, అయితే డీజిల్ అమ్మకాల వరకు వెసులుబాటు ఇవ్వాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ పెట్రోలియం ప్రధాన కార్యదర్శి పేరం రవికుమార్ కోరారు. ఆయన సోమవారం కోవూరులో విలేకరులతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు, తదుపరి చర్యలు పూర్తయ్యే వరకు పెట్రోల్ బంకుల యాజమాన్యం పెట్రోల్, డీజిల్‌ను బాటిల్స్, కంటైనర్స్, డ్రమ్స్‌కు సరఫరా చేయొద్దని ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. అయితే ఇందులో చిన్నస్థాయి పరిశ్రమల నిర్వాహకులు డీజిల్‌ను డ్రమ్ములు లేదా, కంటెయినర్‌లోనే తీసుకెళ్తారని తెలిపారు. ఈ మేరకు డీజిల్‌కు మినహాయింపు ఉంటే చిన్నతరహా పరిశ్రమలకు ఎంతో వెసులుబాటు ఉంటుందని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో శతచండీయాగం


శతచండీయాగం నిర్వహిస్తున్న రుత్విక్కులు

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని త్యాగరాజనగర్‌లో ఉన్న సద్గురు త్యాగరాజ స్వామి మందిరంలో మూడ్రోజుల పాటు నిర్వహిస్తున్న శత చండీయాగాన్ని రెండోరోజు సోమవారం భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. బ్రహ్మశ్రీ మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వేదపండితులు, రుత్విక్కులు ఉదయం చండీహోమం నిర్వహించారు. ప్రదోషం సందర్భంగా సాయంత్రం నందీశ్వరునికి, శివునికి ఏకకాలంలో పంచామృతాభిషేకం, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. మందిరంలో కొలువైన సిద్ధివిఘ్నేశ్వర, సుబ్రహ్మణ్య, జ్ఞాన సరస్వతి, ఆదిత్యాది నవగ్రహ, షిర్డీసాయినాథ, దక్షిణామూర్తి, కమలాంబిక సమేత త్యాగరాజేశ్వర, సీతారామలక్ష్మణ హనుమత్సమేత సద్గురు త్యాగరాజస్వామికి విశేషాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, త్యాగరాజ మందిర నిర్వాహక కమిటీ సభ్యులు ఎనమండ్ర నాగదేవిప్రసాద్ మాట్లాడుతూ శతచండీయాగం మంగళవారం మహా పూర్ణాహుతితో పరిసమాప్తమవుతుందని తెలిపారు. ఉదయం 7గంటల నుంచి రుద్ర,పురుష, శ్రీమన్యుసూక్తం హోమం, తదుపరి చండీ హోమం, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, బాలపూజ, సువాసినిపూజ నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు ఆయా పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమాలను మందిర ధర్మకర్త ఎనమండ్ర చైతన్య కుమార్, వైష్ణవి దంపతులు, త్యాగరాజ మందిర నిర్వాహక కమిటీ సభ్యులు, భిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆంధ్రకేసరి టంగుటూరికి నివాళి

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని గౌడహాస్టల్ సెంటర్‌లో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు 67వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నీతి, నిజాయితీ మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి ఆంధ్రకేసరి అని కొనియాడారు. బ్రాహ్మణ సంఘ నాయకులు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, శ్రీధర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల సంస్మరణోత్సవాలు

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.తిరుపతి కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు బ్రహ్మశ్రీ ఓరుగంటి శ్రీరామలాలశర్మ 'భాష్యసూత్ర ప్రవచన సప్తాహం'లో భాగంగా మూడోరోజు సోమవారం 'చతుస్సూతి' ప్రవచనం చేశారు. అథతో బ్రహ్మ జిజ్ఞాస అనే మహావాక్యాన్ని ఆదిశంకరుల వారు తమ శారీరక మీమాంస గ్రంథంలో ఎలా వివరించారో లక్ష్యార్థ వాక్య పూర్వకంగా విశ్లేషించారు. అద్వైత సిద్ధాంత సారాన్ని, వేద బోధ చేశారు. అనంతరం శ్రీరామలాలశర్మను సభాపోషకులు తాడికొండ శ్రీరామకృష్ణశర్మ, డాక్టర్ పీ చంద్రశేఖర్, చక్రాలవారి ట్రస్ట్, ఆదిశంకర ధ్యాన మందిర కమిటీకి చెందిన చక్రాల ఆనంద్‌కుమార్, ములుముడి ఉదయ్‌కుమార్‌శర్మ, ఎం లక్ష్మీనరసింహారావు, జీ ప్రభాకర్‌శర్మ, పీ ఛాయా కుమారి ఘనంగా సత్కరించారు. తొలుత స్వయంపాకుల సుబ్రహ్మణ్యంశర్మచే విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ట్రస్ట్ మేనేజర్ సీవీఎల్ నరసింహం పర్యవేక్షించారు.

ఎడగారు సాగుకు సై

- నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో వరిసాగు
- బోర్లే రైతన్నలకు ఆధారం


ఎడగారుకు నార్లు పోసుకుని ఉన్న రైతులు


డ్రమ్‌సీడర్‌తో విత్తుకుంటున్న రైతులు


ఎడగారులో ఇప్పటికే నాట్లు పూర్తి చేసుకున్న రైతులు

కొడవలూరు : జిల్లాలో రబీ, ఖరీఫ్‌ల మధ్యలో ఎడగారు సాగు చేయడం ఆనవాయితీ. రబీ పూర్తయ్యాక ఏప్రిల్ 14 నుంచి మే నెలాఖరు వరకు ఎడగారు సాగుకు నార్లు పోసుకుంటారు. సోమశిల జలాశయంలో నీటి నిల్వ కేవలం ఏడున్నర టీఎంసీలు మాత్రమే ఉండడంతో ఈ ఏడాది ఎడగారుకు సాగునీటిని విడుదల నిలిపేశారు. దీంతో బోర్లు అందుబాటులో ఉన్న రైతులు వాటి కింద ఎడగారు వరిసాగు చేస్తున్నారు. సాగునీటి విడుదల ఉంటే కోవూరు నియోజకవర్గం పూర్తి డెల్టా ప్రాంతమైనందున 80 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తారు. నీటి విడుదల లేకపోవడంతో కేవలం బోర్ల సాయంతో సాగు చేయాల్సి ఉన్నందున మండలానికి 3 వేల ఎకరాల వంతున నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఎడగారుకు ఏప్రిల్ మూడో వారంలో నార్లు పోసుకున్న వారు నాట్లు కూడా వేసుకుంటున్నారు. కాస్త ఆలస్యంగా నార్లు పోసుకున్న వారు నాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. బాగా ఆలస్యమైన రైతులు నార్లు పోసుకుంటే మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉండడంతో వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్‌లతో విత్తుకొంటున్నారు.

కేఎన్ఎం 1638 పైనే ఆసక్తి

ఎడగారులో బోర్ల కింద వరిసాగు చేసే రైతులంతా సింహ భాగం కేఎన్ఎం 1638 వరి రకాన్నే సాగు చేస్తున్నారు. అక్కడక్కడా అరకొర రైతులు మాత్రమే కేఎన్ఎం 733 రకాన్ని సాగు చేస్తున్నారు. ఈ రకం వరి పంట జిల్లాలో ఎక్కువగా వినియోగించే బీపీటీ 5204 రకానికి ప్రత్యామ్నాయంగా గుర్తింపు పొందింది. ఈ పంటకు తెగుళ్లు రాకపోవడంతో పాటు వాలిపోవడం జరగదు. దిగుబడి మూడున్నర పుట్లు వరకు వస్తుండడంతో పాటు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. అందువల్లే రైతులు ఈ రకం సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

గట్టెక్కిస్తుందన్న నమ్మకంతోనే..



బోర్ల సదుపాయం ఉన్నందున పది ఎకరాల్లో కేఎన్ఎం 1638 రకాన్ని సాగు చేస్తున్నాను. ఈ రకానికి తెగుళ్లు తక్కువగా ఉండడంతో పాటు మార్కెట్‌లో మంచి ధరకు అమ్ముకునే వెసులుబాటు ఉంటుంది. దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. అందువల్ల గట్టెక్కవచ్చన్న నమ్మకంతోనే పది ఎకరాల్లోనూ ఇదే రకం సాగు చేస్తున్నాను.

– నీలకంఠం శ్రీధర్‌రెడ్డి, రైతు, రెడ్డిపాళెం

కేఎన్ఎం 733 రకాన్ని సాగు చేస్తున్నా..



ఎడగారులో బోర్ల కింద ఐదు ఎకరాల్లో కేఎన్ఎం 733 రకం సాగు చేస్తున్నాను. ఈ రకం కేఎన్ఎం 1638 లక్షణాలనే కలిగి ఉంటుంది. మార్కెట్‌లోనూ ఆ రకంతోనే పోటీ పడుతుంది. ధర కూడా ఆశాజనకంగా ఉంటుంది. అందువల్ల లాభపడవచ్చన్న ధైర్యంతోనే ఈ రకం సాగు చేస్తున్నాను.

– దేగా హరికిషన్, రైతు,గుండాలమ్మపాళెం

ఆరుతడి పంటలపై దృష్టి



ఎడగారుకు సాగునీటి విడుదల లేనందున ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించాం. కొందరు రైతులు మాత్రం మా సూచనలతో ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. పంట వేయని రైతులు నేలను సత్తువ చేసుకునేందుకు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లి పెసర, జనుము పంటలు సాగు చేస్తున్నారు. బోర్ల సదుపాయం ఉన్న రైతులు మాత్రమే వరి సాగు చేస్తున్నారు. బోర్ల కింద పంట పూర్తిగా సాగు చేయగలమనే ధైర్యం ఉన్న రైతులు మాత్రమే సాగు చేస్తున్నట్లు సమాచారం.

– సీహెచ్ఎస్.లక్ష్మి, ఏఓ, కొడవలూరు

పులివాహనంపై ప్రసన్న విశ్వేశ్వరుడు


పులివాహనంపై స్వామివారు

ఇందుకూరుపేట : సముద్రతీర ప్రాంతమైన మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పులివాహనంపై ఊరేగారు. ఈ నేపథ్యంలో స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాల నడుమ గ్రామవీధుల్లో ఊరేగుతున్న స్వామివారికి భక్తులు కొబ్బరికాయ, కర్పూర హారతులు అందజేసి స్వామివారి కృపా కటాక్షం పొందారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉభయకర్తలుగా సుభాష్ అక్వా సీడ్స్ అధినేత పామంజి నరసింహులు, అనిత దంపతులు వ్యవహరించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

చెట్టు నరికి పంచాయతీ స్థలం ఆక్రమణ

- పోలీస్ కేసు నమోదు



మనుబోలు : మనుబోలు వైఎస్సార్ సర్కిల్‌లో తాత్కాలికంగా టిఫిన్ దుకాణం నిర్వహిస్తున్న సాయి అనే వ్యక్తి అదే స్థలంలో రేకుల షెడ్డు వేసేందుకు సోమవారం వేపచెట్టు కొమ్మను నరికేశాడు. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉన్న వేపచెట్టు నీడన ప్రయాణికులు సేద తీరుతారు. వేసవి ఎండలకు నీడనిస్తున్న పచ్చటి చెట్టు కొమ్మను నరికివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ స్థలంలో అక్రమంగా టిఫిన్ దుకాణం నిర్వహించడమే కాకుండా దానికి రేకులు వేసేందుకు నీడనిచ్చే చెట్టును నరికేయడం ఏమిటని నిలదీస్తున్నారు. ఎస్సై అజయ్‌కుమార్ టిఫిన్ దుకాణ యజమానిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

- ఏఓ లక్ష్మి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారిని సీహెచ్ఎస్.లక్ష్మి సూచించారు. 'పీఎం ప్రణామ్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆలూరుపాడు, రామన్నపాళెంలలో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకర ఉత్పత్తులను ఇచ్చే ప్రకృతి వ్యవసాయంపై ప్రతి రైతు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ప్రతి రైతు విధిగా భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఆధారంగానే ఎరువులను వినియోగించాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నందున ఎడగారు సాగు చేయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీ ఉపయోగాలను రైతులకు సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు కేవీ పృథ్వీ, ఆర్.నిహారిక, రైతులు పాల్గొన్నారు.

పంట దిగుబడికి నేల కీలకం


మాట్లాడుతున్న వాగ్దేవి

ఇందుకూరుపేట : పంటల దిగుబడిలో నేల అత్యంత కీలకం అని వ్యవసాయాధికారి వాగ్దేవి అన్నారు. మండలంలోని పల్లిపాడు, ముదివర్తిపాళెంలో మండల వ్యవసాయాధికారి డి.రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో భూసార పరిరక్షణపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి కలుషితం కాకుండా రైతులు తమ వంతు కృషి చేయాలన్నారు. భూమి సంరక్షణకు ఎరువులు, పురుగు మందులను నిలిపి ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలన్నారు. ఏడాదిలో ఒకే పంట వేయకుండా పంట మార్పిడి చేసుకుంటూ వెళ్లాలన్నారు. భూసారం పెరిగేందుకు పచ్చిరొట్ట, జీలుగ, జనుము, పిల్లిపెసర వంటివి వేసుకుని భూసారం పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు శ్రీకాంత్, యమున తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి


మాట్లాడుతున్న సర్పంచ్ నాగమ్మ

మనుబోలు : గ్రామంలో సమస్యలను గుర్తించి పరిష్కారానికి దృష్టి సారించాలని సర్పంచ్ నాగమ్మ అధికారులు, పంచాయతీ సిబ్బందికి సూచించారు. మండలంలోని జట్లకొండూరు పంచాయతీ కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు ముగిసినందున ఇక మౌలిక సమస్యలైన తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు తదితర సమస్యలపై పంచాయతీ సిబ్బంది దృష్టి సారించాలన్నారు. సచివాలయాల సిబ్బంది, ఇతర అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ ఆవుల తులసీరామ్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, వార్డు సభ్యులు సురేష్, భద్రయ్య, కల్యాణి, పద్మమ్మ, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి


ఎస్పీతో పోలీసు అధికారుల సంఘ నాయకులు

నెల్లూరు(క్రైమ్): పోలీసు సిబ్బంది సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎస్పీ కే ఆరిఫ్‌హఫీజ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని ఏపీ పోలీసు అధికారుల సంఘ రాష్ట్ర నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతి శుక్రవారం పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించి సిబ్బంది సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తున్న ఎస్పీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో సంఘ రాష్ట్రాధ్యక్షుడు జనకుల శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడు వై శ్రీహరి, ఉపాధ్యక్షుడు పీ శేషయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌కే గౌస్‌బాషా, కోఆప్షన్ మెంబర్ బీవీ నరసయ్య, జిల్లా పోలీసు కోఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి వైవీ రమణయ్య, డైరెక్టర్ బీ రమణయ్య, సభ్యులు ఉదయ్, తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

వెంకటాచలం : వెంకటాచలం పోలీస్‌స్టేషన్ పరిధిలో '30 పోలీస్ యాక్ట్' అమలులో ఉందని, ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ వీరాంజనేయరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాక్ట్ ప్రకారం ప్రజలు అనుమతి లేనిదే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించకూడదని తెలియజేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నెల్లూరు(క్రైమ్): నగర పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నెల్లూరు నగర సబ్‌డివిజన్ పరిధిలో ఏపీ 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉందని తెలిపారు. రాజకీయ పార్టీలు ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీల నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు అమల్లో ఉందని తెలిపారు. కోడ్ ముగిసిన తరువాత పరిశీలించి ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతిస్తామన్నారు. పెట్రోల్, డీజిల్ లూజు విక్రయాలు చేయరాదని పెట్రోల్‌బంకుల నిర్వాహకులకు సూచించారు. రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్, ఎన్నికల కేసుల్లో ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

- నెల్లూరు రూరల్ సబ్‌డివిజన్ పరిధిలోని వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరు రూరల్, కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట, కృష్ణపట్నం పోర్టు పోలీసుస్టేషన్‌ల పరిధిలో 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉందని నెల్లూరు రూరల్ డీఎస్పీ పీ వీరాంజనేయరెడ్డి తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన చట్టపరమైన చర్యలు తప్పవని సోమవారం ఒక ప్రకటనలో ఆయన హెచ్చరించారు.

ముస్లిం చిన్నారులకు ఉచిత ఖత్నాలు



నెల్లూరు(బృందావనం): మద్రస-ఏ-నూరుల్ ఇస్లాం ట్రస్ట్ తరుపున ఇస్మాయిల్‌ఖాదిరి ఆధ్వర్యంలో ముస్లిం చిన్నారులకు ఉచిత ఖత్నాలు కార్యక్రమాన్ని 29వ డివిజన్ పరిధిలోని మహాత్మాగాంధీనగర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంద మంది చిన్నారులు ఉచితంగా ఖత్నాలు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరై నెల్లూరు నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్ అహ్మద్ చేతుల మీదుగా ఉచితంగా దుస్తులు, మందులు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ సత్తార్, 42వ డివిజన్ కార్పొరేటర్ షేక్ కరీముల్లా, 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, 29వ డివిజన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సాయిరెడ్డి, 34వ డివిజన్ అధ్యక్షుడు షేక్ రియాజ్, పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ సూరిబాబు, బీసీ నాయకులు అమర్, ప్రైవేట్ విద్యా సంస్థల చైర్మన్ షేక్ అన్వర్‌బాషా, షేక్ అమీర్‌జాన్, బారాషహీద్ దర్గా కమిటీ మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్‌రజాక్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు : వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే సేంద్రియ ఎరువులను విరివిగా వాడాలని మండల వ్యవసాయాధికారి శిరీషారాణి సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సోమవారం వరిగొండ బిట్-1, వరిగొండ బిట్-2 గ్రామాల్లో సమగ్ర పోషణ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ఏఓ శిరీషారాణి మాట్లాడుతూ వ్యవసాయంలో ఎరువుల ఎంపిక అత్యంత కీలకమన్నారు. సాగుకు ముందు మట్టి పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా ఎరువులు వాడాలన్నారు. రసాయన ఎరువుల మోతాదును తగ్గించి పచ్చిరొట్టి ఎరువులు, జీవన ఎరువులు వంటి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్న పచ్చిరొట్టి ఎరువులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్బీకేల వ్యవసాయ గ్రామ సహాయకులు ప్రసన్న, సుమంత్, పలువురు రైతులు పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో ఏకాగ్రత


యోగా ట్రైనర్ ఆధ్వర్యంలో ధ్యానం చేస్తున్న చిన్నారులు

మనుబోలు : యోగా, ధ్యానం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని యోగా ట్రైనర్ కోటేశ్వర్ రెడ్డి తెలిపారు. మనుబోలు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు యోగా, ధ్యానం ప్రాధాన్యతను వివరించి వారి చేత యోగా, ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీసేలా వివిధ రకాల కార్యక్రమాలను రూపొందించామన్నారు. ఈ శిబిరాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. సెలవుల్లో చిన్నారులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి మార్గాల వైపు మళ్లేందుకు ఈ శిబిరాలు దోహదపడుతాయన్నారు.

హంస వాహనంపై కోదండరాముడు


హంస వాహనంపై స్వామివారు

కోవూరు : మండల కేంద్రమైన కోవూరులోని గాంధీ బొమ్మ సెంటర్‌లో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు హంస వాహనంపై విహరించారు. గ్రామ వీధుల్లో ఊరేగిస్తున్న స్వామివారిని భక్తులు దర్శించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీకాంతాచార్యులు పూజా కార్యక్రమాలు జరిపించారు.



ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ


అక్షర విద్యాలయంలో శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

వెంకటాచలం : మండలంలోని సరస్వతీనగర్ వద్ద నున్న అక్షర విద్యాలయంలో ఈనెల 16వ తేదీ నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లకు వివిధ విభాగాల్లో ఆర్మీ స్టాఫ్, ఇతర అధికారుల చేత శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేకంగా రిపబ్లిక్ డే క్యాంపు, తలసైనిక్ క్యాంపులోని ముఖ్యమైన అంశాలైన ఫ్లాగ్ ఏరియా, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, జడ్జింగ్ డిస్టెన్స్, యుద్ధ నైపుణ్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, జీవన నైపుణ్యాల మీద అవగాహన కల్పించారు. ఆర్మీ, ఎన్‌సీసీకి సంబంధించి ఈనెల 24వ తేదీ వరకు శిక్షణా శిబిరం జరుగుతుందని శిక్షణ ప్రత్యేకాధికారి లెఫ్టినెంట్ కల్నల్ మహేష్ తెలిపారు.